ఒలింపిక్స్ బాక్సింగ్‌లో వివాదం

ఇమానె ఖెలిఫ్, లిన్ యు టింగ్ పోటీపై రచ్చ

# ఆమె పోటీల్లో అతడు!

ఐవోసీపై డొనాల్డ్ ట్రంప్, ఎలాన్ మస్క్, జేకే రౌలింగ్ మండిపాటు

తమ చర్యలను సమర్థించుకున్న ఐవోసీ అధికారులు • ఖెలిఫ్‌కు ద్యుతిచంద్ మద్దతు



ఇమానె ఖెలిఫ్



లిన్ యు టింగ్

విల్లెపింటె(ఫ్రాన్స్): ప్రతిష్ఠాత్మక పారిస్ ఒలింపిక్స్‌లో మరో వివాదం రాజుకుంది. ఇప్పటికే ఆరంభ వేడుకల్లో అతి చేయడం ద్వారా తీవ్ర విమర్శలు ఎదుర్కొన్న నిర్వాహకులు..ప్రస్తుతం మహిళల బాక్సింగ్ పోటీల్లో పురుష లక్షణాలు ఉన్న వాళ్లను అనుమతించి అభాసుపాలయ్యారు. విశ్వక్రీడల్లో మహిళల బాక్సింగ్ పోటీలు హాట్ టాపిక్‌గా మారాయి. గురువారం జరిగిన మహిళల 66కిలోల బౌట్ ఇందుకు కారణమైంది. అల్జీరియాకు చెందిన ఇమానె ఖెలిఫ్, ఇటలీ బాక్సర్ ఎంజెలా కెరినీ మధ్య బౌట్ అగ్నికి ఆజ్యం పోసింది. తన తండ్రి కలను సాకారం చేసేందుకు కొన్ని ఏండ్లుగా కఠోర శిక్షణ తీసుకున్న కెరినీ..పారిస్‌లో పతకాన్ని ముద్దాడాలన్న లక్ష్యంతో బరిలోకి దిగింది. కానీ ఆమె ఆశలు ఖెలిఫ్ రూపంలో ఆదిలోనే ఆవిరయ్యాయి. బౌట్ మొదలైన 46 సెకన్ల వ్యవధిలోనే కెరినీ కన్నీటి పర్యంతం అవుతూ ఓటమికి ఒప్పుకుంది. అసలు ఏం జరిగింది అని తెలుసుకునేలోపే జరుగాల్సిన నష్టం జరిగిపోయింది. తన కెరీర్‌లో ఇప్పటి వరకు ఎదుర్కొని పవర్‌ఫుల్ పంచ్‌లను ఎదుర్కోవడంతో బాధకు గురైన కెరినీ బౌట్‌లో కన్నీరు కారుస్తూ కుప్పకూలిపోయింది. తన కోచ్‌తో మాట్లాడి బౌట్‌లో కొనసాగలేనంటూ రింగ్‌ను వీడింది. ఎంజెలా కెరినీ, ఇమానె ఖెలిఫ్ మధ్య బాక్సింగ్ పోరు ప్రస్తుతం పారిస్ ఒలింపిక్స్‌ను షేక్ చేస్తున్నది. టెస్టోస్టిరాన్(పురుష లక్షణాలు) ఎక్కువ ఉన్న ఖెలిఫ్‌కు ఎలా అనుమతిచ్చారంటూ అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ(ఐవోసీ)పై అందరూ దుమ్మెత్తిపోస్తున్నారు. ఇదిలా ఉంటే శుక్రవారం జరిగిన 57కిలోల తొలి బౌట్‌లో తైవాన్ బాక్సర్ లిన్ యు టింగ్..సితోర తుర్దిబెకోవాపై గెలిచి ముందంజ వేసింది.

**ఐవోసీపై ట్రంప్, మస్క్ గరం:**

పురుష లక్షణాలు ఎక్కువగా ఉన్న మహిళా బాక్సర్లను పారిస్ ఒలింపిక్స్‌కు అనుమతించిన ఐవోసీ నిర్వాహకులపై అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, టెస్లా కంపెనీ అధినేత ఎలాన్ మస్క్, ప్రముఖ రచయిత్రి జేకే రౌలింగ్ తమదైన రీతిలో తూర్పార పట్టారు. 'మహిళల పోటీల్లో పురుషులు లేకుండా చేస్తా' అని ట్రంప్ ఘాటుగా స్పందించాడు. మరోవైపు జేకే రౌలింగ్ ఎక్స్‌లో స్పందిస్తూ 'ఈ పోటీని చూడండి.. మీ ఎంటర్‌టైన్‌మెంట్ కోసం ఒక మహిళపై పురుషుడు బహిరంగంగా దాడి చేయడానికి మీరు ఎలా అనుమతిస్తారు? ఇది క్రీడ కాదు. స్త్రీలపై పురుషులు తమ ఆధిపత్యం ప్రదర్శించడం కిందికే వస్తుంది. అసలు ఈ పోటీకి నిర్వాహకులు ఎలా అనుమతి ఇచ్చారు' అంటూ మండిపడింది. కెరినీకి మద్దతుగా అమెరికా స్విమ్మర్ పెట్టిన ట్వీట్‌కు మస్క్ మద్దతుగా నిలిచాడు. ఇలా ఒక్కరిద్దరికే పరిమితం గాకుండా ఇటలీ ప్రధానమంత్రి గ్రెగోరియన్ మెలోనీ తమ దేశ బాక్సర్‌కు అండగా నిలిచాడు.

**ఖెలిఫ్‌కు ద్యుతి మద్దతు:**

'మోతాదుకు మించి టెస్టోస్టిరాన్ స్థాయిపై 2014లో అంతర్జాతీయ అత్యున్నత క్రీడా న్యాయ స్థానంలో సవాలు చేసి ఐవోసీపై నేను విజయం సాధించాను. హార్మోన్ స్థాయి అనేది అథ్లెట్ల ప్రదర్శనపై ఎలాంటి ప్రభావం చూపదు. ఆ సమయంలో నా లింగంపై వివాదం నెలకొంది. ప్రస్తుతం ఖెలిఫ్ విషయంలోనూ అదే జరుగుతున్నది. ఖెలిఫ్ శరీరంలో టెస్టోస్టిరాన్ నిల్వలపై ఫిర్యాదులు వస్తూనే ఉన్నాయి. సోషల్‌మీడియాలో దీనిపై చర్చగా జరుగుతున్నది. అథ్లెట్లను అన్ని రకాలుగా పరీక్షిస్తూనే ఉంటారు' ద్యుతి పేర్కొంది.

**ఐవోసీ సమర్థన**

పారిస్ ఒలింపిక్స్‌లో ఖెలిఫ్, లిన్ యు టింగ్ ప్రాతినిధ్యాన్ని ఐవోసీ పూర్తిగా సమర్థించుకుంది. 'వాళ్ల పాస్‌పోర్ట్‌లపై మహిళలు అనే ఉంది. టోక్యోలోనూ వారు మహిళల విభాగంలోనే పోటీపడ్డారు. పారిస్ బాక్సింగ్ యూనిట్ నియమ, నిబంధనలకు అనుగుణంగా బాక్సర్లు అర్హత సాధించారు' అని ఐవోసీ పేర్కొంది.

### అసలు వివాదం ఏంటీ?

అంతర్జాతీయ బాక్సింగ్ అసోసియేషన్(ఐబీఏ)పై ఐవోసీ సస్పెన్షన్ కొనసాగుతున్నది. కార్యకలాపాలు సరిగ్గా లేవన్న కారణంతో ఐబీఏ వ్యవహారాలపై నిషేధం ఉంది. బాక్సింగ్ టోర్నీల విషయంలో ఐబీఏ, ఐవోసీ మధ్య స్పష్టమైన తేడాలు కనిపిస్తున్నాయి. 2023 ఢిల్లీలో జరిగిన ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్ నుంచి ఖెలిఫ్, లిన్ యును ఐబీఏ తప్పించింది. పురుష లక్షణాలు ఎక్కువగా ఉన్నాయన్న కారణంతో ఐబీఏ ఈ నిర్ణయం తీసుకుంది. దీనిపై ఐవోసీ తీవ్ర స్థాయిలో స్పందించింది. అప్పటి వరకు దాదాపు అన్ని టోర్నీల్లో ఆడిన ఖెలిఫ్, యు టింగ్‌ను తప్పించడానికి గల కారణాలు ఏంటంటూ నిలదీసింది.



# 52 ఏండ్ల తర్వాత..

ఆస్ట్రేలియాపై భారత్ చారిత్రక విజయం

హాకీలో క్వార్టర్స్‌కు టీమ్ ఇండియా • హర్మన్‌ప్రీత్ సూపర్ ఫామ్

పారిస్: రెండ్రోజుల క్రితం బెల్జియం చేతిలో ఓడి 'పారిస్'లో తొలి ఓటమి రుచిచూసిన భారత హాకీ జట్టు అనూహ్యంగా పుంజుకుంది. టోక్యో ఒలింపిక్స్‌లో రజత పతక విజేత, పటిష్టమైన ఆస్ట్రేలియాపై అద్భుత విజయంతో సగర్వంగా క్వార్టర్స్‌కు అర్హత సాధించింది. తమ చివరి లీగ్ మ్యాచ్‌లో భారత్.. 3-2తో ఆస్ట్రేలియాను చిత్తుచేసింది. ఒలింపిక్స్‌లో ఆస్ట్రేలియాపై భారత్‌కు 52 ఏండ్ల తర్వాత (చివరిసారి 1972 మునిచ్‌లో) ఇదే తొలి విజయం. ఈ ఏడాది ఆస్ట్రేలియా పర్యటనలో నాలుగు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ ఆడుతూ దారుణంగా ఓడిన మెన్ ఇన్ బ్లూ.. కీలకమైన పోరులో మాత్రం జూలు విదిల్చింది. 12వ నిమిషంలోనే అభిషేక్ తొలి గోల్ చేసి భారత్‌ను ఆధిక్యంలోకి తెచ్చాడు. వాస్తవానికి గోల్ చేసేందుకు లలిత్ బంతిని గోల్ పోస్ట్ వైపునకు పంపాలని యత్నించినా ప్రత్యర్థి గోల్‌కీపర్ ఆండ్రూ చార్టర్ దానిని అడ్డుకున్నాడు. అయితే అదే సమయంలో అక్కడే ఉన్న అభిషేక్ బంతిని దొరకబుచ్చుకుని రాకెట్ వేగంతో దానిని గోల్‌పోస్ట్‌కు పంపించాడు. ఆ వెంటనే 13వ నిమిషంలో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ ఈ టోర్నీలో తన సూపర్ ఫామ్‌ను కొనసాగిస్తూ పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలచడంతో భారత్ 2-0 ఆధిక్యంలోకి దూసుకుపోయింది. ఆస్ట్రేలియాకూ పలు మార్లు పెనాల్టీ కార్నర్‌లు లభించినా చివరి ఒలింపిక్స్ ఆడుతున్న గోల్ కీపర్ పీఆర్ శ్రీజేష్ వాటిని విజయవంతంగా అడ్డుకున్నాడు. అయితే 25వ నిమిషంలో టామ్ క్రెయిగ్ గోల్ కొట్టి ఖాతా తెరిచి ఆ జట్టును పోటీలోకి తెచ్చాడు. కానీ మూడో క్వార్టర్‌లో హర్మన్‌ప్రీత్ 33వ నిమిషంలో మరోసారి లభించిన పెనాల్టీ కార్నర్ అవకాశాన్ని రెండు చేతులా సద్వినియోగం చేసుకుంటూ భారత్‌కు మూడో గోల్‌ను అందించాడు. 55వ నిమిషంలో బ్లేక్ గోవర్స్ గోల్ కొట్టినా అది ఆ జట్టు ఓటమి అంతరాన్ని మాత్రమే తగ్గించింది. ఈ విజయంతో పూల్-బీలో లీగ్ దశను రెండో స్థానం (9 పాయింట్లు)తో ముగించింది. బెల్జియం (12) అగ్రస్థానంలో ఉంది.

# మూడో మెడల్ లోడింగ్

## 25 మీటర్ల పిస్టల్ ఈవెంట్ ఫైనల్‌కు మను భాకర్

గెలిస్తే వరుసగా ఒలింపిక్స్‌లో 3వ పతకం

నిరాశపరిచిన హైదరాబాదీ షూటర్ ఇషా సింగ్



**పారిస్ ఒలింపిక్స్‌లో అంచనాలకు మించి రాణిస్తున్న యువ షూటర్ మను భాకర్ మరోసారి పతకం దిశగా కీలక ముందడుగు వేసింది. ఈ ఎడిషన్‌లో ఇప్పటికే 10 మీటర్ల ఎయిర్ పిస్టల్, 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్స్‌లో కాంస్యాలు సాధించి చరిత్ర సృష్టించిన ఈ హర్యానా అమ్మాయి.. శుక్రవారం జరిగిన మహిళల 25 మీటర్ల పిస్టల్ ఈవెంట్ క్వాలిఫికేషన్ రౌండ్‌లో రెండో స్థానంతో ముగించి ఫైనల్‌కు అర్హత సాధించింది. శనివారం జరిగే ఫైనల్‌లోనూ గెలిస్తే వ్యక్తిగతంగా మూడో పతకం సాధించిన అథ్లెట్‌గా భారత ఒలింపిక్ చరిత్రలో తన పేరును సువర్ణాక్షరాలతో లిఖించుకుంటుంది. ఇదే ఈవెంట్‌లో పోటీపడ్డ హైదరాబాదీ యువ షూటర్ ఇషా సింగ్ మాత్రం నిరాశపరిచింది.**



పారిస్: టోక్యో ఒలింపిక్స్‌లో ఎదురైన వైఫల్యాలకు పారిస్‌లో పతకాలతోనే దిమ్మతిరిగే సమాధానాలు చెబుతున్న యువ సంచలనం మను భాకర్ వరుసగా మూడో పతకంపై కన్నేసింది. తాజా ఎడిషన్‌లో ఇది వరకే రెండు కాంస్యాలు పట్టుకొచ్చిన మను.. శుక్రవారం ముగిసిన మహిళల 25 మీటర్ల పిస్టల్ ఈవెంట్ క్వాలిఫికేషన్‌లో 590 పాయింట్లు స్కోరు చేసి రెండో స్థానంతో ముగించి ఫైనల్స్‌కు అర్హత సాధించింది. రెండు (ప్రిసీషన్, ర్యాపిడ్) భాగాలుగా జరిగే అర్హత రౌండ్‌లో మను తుపాకీ మరోసారి గురి తప్పకుండా లక్ష్యం వైపునకు దూసుకెళ్లింది. ప్రిసీషన్ మూడు సిరీస్‌లలో 97, 98, 99 పాయింట్లు స్కోరు చేసిన మను.. ర్యాపిడ్‌లో 100, 98, 98తో అర్హత రౌండ్‌ను రెండో స్థానంతో ముగించింది. హైదరాబాదీ షూటర్ ఇషా సింగ్ 581 పాయింట్లు స్కోరుతో తీవ్ర నిరాశపరిచింది.

**నెమ్మదిగా మొదలెట్టి..**

ప్రిసీషన్ రౌండ్‌ను మను నెమ్మదిగానే మొదలుపెట్టింది. తొలి సిరీస్‌లో రెండు సార్లు మాత్రమే 10 పాయింట్లు సాధించిన ఆమె రెండో సిరీస్‌లో మాత్రం 4 సార్లు పది స్కోరు చేసింది. 3వ సిరీస్‌లో ఐదింటికి ఐదు షాట్లకు 10 పాయింట్లు వచ్చాయి. ఇక ర్యాపిడ్‌లోనూ ఇదే జోరును కొనసాగించింది. ర్యాపిడ్ మూడు సిరీస్‌లలో రెండు సార్లు 9 స్కోరు చేయగా ఒక్కసారి మాత్రమే 8 పాయింట్లు రాగా మిగిలిన ప్రతి షాట్‌కు 10/10 వచ్చాయి. హంగేరి షూటర్ వెరొనిక 592 స్కోరు చేసి అగ్రస్థానంలో నిలిచింది. 8 మంది పోటీపడే ఫైనల్‌లో మను ఇదే ఫామ్‌ను కొనసాగిస్తే హ్యాట్రిక్ మెడల్ పెద్ద కష్టమేమీ కాదు. ఇప్పటి వరకు భారత్ తరఫున సుదీర్ఘ ఒలింపిక్స్ చరిత్రలో ఒకే ఎడిషన్‌లో మూడు పతకాలు గెలిచిన ప్లేయర్ ఎవరూ లేకపోవడం విశేషం.

### పతకాల పట్టిక

| | దే | స్వ | ర | కా | మొ |
|---|---|---|---|---|---|
| 1 | చైనా | 13 | 8 | 9 | 30 |
| 2 | ఫ్రాన్స్ | 10 | 11 | 12 | 33 |
| 3 | ఆస్ట్రేలియా | 10 | 6 | 5 | 21 |
| 4 | యూఎస్ఏ | 9 | 18 | 15 | 42 |
| 5 | బ్రిటన్ | 9 | 10 | 8 | 27 |
| 6 | జపాన్ | 8 | 3 | 6 | 17 |
| 44 | భారత్ | 0 | 0 | 3 | 3 |

దే : దేశం, స్వ: స్వర్ణం, ర: రజతం, కా: కాంస్యం మొ: మొత్తం

భారత బ్యాడ్మింటన్‌లో సరికొత్త చరిత్ర

# సెమీస్‌కు లక్ష్యసేన్

పురుషుల విభాగంలో తొలి షట్లర్‌గా రికార్డు • ఆర్చరీ కాంస్య పోరులో ఓటమి



పారిస్: విశ్వక్రీడల్లో భారత్ తరఫున మరో సంచలనం. బ్యాడ్మింటన్‌లో దేశానికి పతకం పట్టుకొస్తారని భావించిన స్టార్ షట్లర్లంతా తీవ్రంగా నిరాశపరిచి క్వార్టర్స్ పోరు కంటే ముందే ఇంటిబాట పట్టినా అసలు అంచనాలే లేని యువ షట్లర్ లక్ష్యసేన్ మాత్రం సెమీఫైనల్స్‌కు అర్హత సాధించాడు. శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్ మ్యాచ్‌లో లక్ష్యసేన్.. 19-21, 21-15, 21-12తో చో టీన్ చెన్ (చైనీస్ తైపీ)పై గెలిచి సెమీస్‌కు దూసుకెళ్లడమే గాక ఒలింపిక్స్‌లో ఈ క్రీడ నుంచి సెమీఫైనల్స్‌కు అర్హత సాధించిన తొలి పురుష షట్లర్‌గా నిలిచాడు. మొదటి సెట్‌ను త్రుటిలో కోల్పోయినప్పటికీ తర్వాత పుంజుకున్న ఈ ఉత్తరాఖండ్ కుర్రాడు.. తర్వాత రెండు సెట్లలోనూ పూర్తి ఆధిపత్యం చెలాయించి ప్రత్యర్థికి చుక్కలు చూపించాడు. సేన్ గెలుపుతో ఈ మెగా ఈవెంట్‌లో భారత్ మరో పతకం వేటలో ఉన్నట్టే. సెమీస్‌లో సేన్.. లో కీన్ యా (సింగపూర్), విక్టర్ అక్సెల్సెన్ (డెన్మార్క్) మధ్య జరిగే మ్యాచ్ విజేతతో తలపడతాడు. ఈ పోరులో నెగ్గితే భారత్‌కు కనీసం రజతం ఖాయమవ్వనుండగా ఆ మ్యాచ్‌లో ఓడితే కాంస్యమైనా పట్టుకొచ్చే చాన్స్ ఉంది. భారత బ్యాడ్మింటన్ చరిత్రలో ఇప్పటివరకూ సైనా నెహ్వాల్, పీవీ సింధు మాత్రమే సెమీస్ చేరారు. పురుషుల విభాగంలో పారుపల్లి కశ్యప్ (2012) కిదాంబి శ్రీకాంత్ (2016) క్వార్టర్స్ చేరడమే ఇప్పటివరకూ అత్యుత్తమ ప్రదర్శన. తాజాగా లక్ష్యసేన్ ఆ రికార్డును అధిగమించి కొత్త చరిత్ర సృష్టించాడు.

### త్రుటిలో తప్పిన గురి



నాలుగో పతకం మీద ఆశలు రేపిన ఆర్చర్లు కాంస్య పోరులో గురి తప్పారు. ఆర్చరీ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో భాగంగా అంకితా భకత్, ధీరజ్ బొమ్మదేవరతో కూడిన భారత్.. 2-6 (37-38, 35-37, 38-34, 35-37)తో యూనైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా (యూఎస్ఏ) చేతిలో ఓడింది. తొలి మ్యాచ్‌లో 5-1తో ఇండోనేషియాను చిత్తుచేసిన భారత్.. క్వార్టర్స్‌లో 5-3తో స్పెయిన్‌ను ఓడించి సెమీస్ చేరింది. ఈ మ్యాచ్‌లో గెలిస్తే దేశం ఖాతాలో మరో కాంస్యం వచ్చేది. అయితే సెమీస్‌లో ధీరజ్ రాణించినా అంకితా పలు మార్లు 7 పాయింట్లే స్కోరు చేసి లక్ష్యానికి గురి తప్పడంతో భారత్‌కు నిరాశ తప్పలేదు.

# తొలి వన్డే ఉత్కంఠ 'టై'

- **భారత్‌కు షాక్ ఇచ్చిన శ్రీలంక**
- **స్వల్ప ఛేదనలో తడబడ్డ బ్యాటర్లు**

కొలంబో: శ్రీలంక పర్యటనలో టీ20 సిరీస్‌ను క్లీన్ స్వీప్ చేసి జోరుమీదున్న భారత్‌కు వన్డే సిరీస్‌లో తొలి మ్యాచ్‌లోనే ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. కొలంబోలోని ప్రేమదాస స్టేడియం వేదికగా శుక్రవారం జరిగిన మొదటి వన్డే 'టై'గా ముగిసింది. శ్రీలంక నిర్దేశించిన 231 పరుగుల ఛేదనలో భారత్ 47.5 ఓవర్లలో 230 పరుగుల వద్దే ఆలౌట్ అవడంతో మ్యాచ్ టై అయింది. స్వల్ప ఛేదనలో కెప్టెన్ రోహిత్ శర్మ (47 బంతుల్లో 58, 7 ఫోర్లు, 3 సిక్సర్లు) అర్ధ సెంచరీ చేయగా అక్షర్ పటేల్ (33), కెఎల్ రాహుల్ (31), శివమ్ దూబె (25) ఫర్వాలేదనిపించారు. 47.3 ఓవర్లప్పుడు దూబె ఫోర్ కొట్టి స్కోర్లను సమం చేసినా ఆ తర్వాత వరుసగా రెండు వికెట్లు కోల్పోవడంతో టీమ్‌ఇండియాకు నిరాశ ఎదురైంది. లంక బౌలర్లలో కెప్టెన్ అసలంక (3/30), హసరంగ (3/58) రాణించారు. 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' దునిత్ వెల్లలగె (2/39) బంతితో పాటు బ్యాట్ (67)తోనూ మెరిశాడు. లంక ఇన్నింగ్స్‌లో వెల్లలగె, పతుమ్ నిస్సంక (56) అర్ధ సెంచరీలతో ఆ జట్టు పోరాడే స్కోరును సాధించింది.



# అథ్లెట్లకు నిరాశ

భారత అథ్లెట్లు పారుల్ చౌదరీ, అంకితా దయానీ తీవ్రంగా నిరాశపరిచారు. శుక్రవారం జరిగిన మహిళల 5వేల మీటర్ల విభాగంలో బరిలోకి దిగిన పారుల్, అంకిత ఫైనల్స్‌కు అర్హత సాధించలేకపోయారు. హీట్-1లో పోటీపడ్డ పారుల్ 15:10.68 సెకన్ల టైమింగ్‌తో 14వ స్థానంలో నిలిచింది. ఈ క్రమంలో తన పేరిట ఉన్న జాతీయ రికార్డు (15:10.35సె)ను సవరించలేకపోయింది. మరోవైపు హీట్స్-2లో అంకిత 16:19.38 సెకన్లతో 20వ స్థానంతో సరిపెట్టుకుంది. కిప్యోజెన్(కెన్యా), డేవిస్(ఆస్ట్రేలియా), గ్రోవ్డల్(నార్వే) వరుసగా స్వర్ణ, రజత, కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. మరోవైపు పురుషుల షాట్‌పుట్‌లో భారత అథ్లెట్ తజిందర్‌పాల్‌సింగ్ తూర్ తన తొలి ప్రయత్నంలో 18.05 మీటర్లతో సరిపెట్టుకున్నాడు. స్టానెక్(21.61మీ) అగ్రస్థానంలో నిలిచాడు.

# ఫైనల్‌కు అల్కారజ్

- **స్వియాటెక్‌కు కాంస్యం**

పారిస్: తన కెరీర్‌లో తొలిసారి ఒలింపిక్స్ ఆడుతున్న స్పెయిన్ యువ సంచలనం కార్లోస్ అల్కారజ్ మొదటి ప్రయత్నంలోనే పతకం ఖాయం చేసుకున్నాడు. పురుషుల సింగిల్స్ సెమీస్‌లో అల్కారజ్ 6-1, 6-1తో ఫెలిక్స్ అగర్ అలిఅస్సిమె (కెనడా)ను ఓడించి ఫైనల్‌కు దూసుకెళ్లాడు. నాలుగేండ్ల తన స్వల్ప కెరీర్‌లో ఇదివరకే నాలుగు గ్రాండ్‌స్లామ్‌లు నెగ్గిన ఈ స్పెయిన్ కుర్రాడు ఒలింపిక్స్‌లోనూ పతకం సాధించాలనే పట్టుదలతో ఉన్నాడు. రెండో సెమీస్‌లో జొకొవిచ్ (సెర్బియా), ముసెట్టి (ఇటలీ) మధ్య మ్యాచ్‌లో గెలిచిన ప్లేయర్‌తో అతడు అమీతుమీ తేల్చుకోనున్నాడు. ఇక మహిళల సింగిల్స్‌లో ప్రపంచ నంబర్‌వన్ పోలండ్ అమ్మాయి ఇగా స్వియాటెక్‌కు కాంస్యం దక్కింది. కాంస్య పోరులో స్వియాటెక్ 6-2, 6-1తో అన్నా కరోలినా (స్లోవేకియా)ను ఓడించింది. శనివారం జరిగే ఫైనల్‌లో కిన్వెన్ జెంగ్ (చైనా), డొన వెకిచ్ (క్రొయేషియా) తలపడనున్నారు.



# పారిస్‌లో భారత బృందానికి 40 ఏసీలు

పారిస్: భారత క్రీడాకారుల సౌకర్యార్థం కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ 'ఒలింపిక్ విలేజ్'కు 40 ఎయిర్ కూలర్లను పంపించింది. పారిస్‌లో ఎండలు మండిపోతుండగా పగటిపూట ఉష్ణోగ్రతలకు క్రీడాకారులు అల్లాడిపోతున్నారు. అయితే అందుకు అనుగుణంగా ఒలింపిక్ గ్రామంలో సరైన ఏసీలు అందుబాటులో లేకపోవడంతో మన అథ్లెట్లు అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ విషయమై ఫ్రెంచ్ ఎంబసీతో సమావేశమైన భారత ఒలింపిక్ అసోసియేషన్.. మన ఆటగాళ్లకు 'చల్లటి' కబురు అందించింది.

